



పలువురు ఎస్‌ఐల బదిలీ

ఖమ్మం క్రైం, జూలై 20: ఖమ్మం జిల్లాలో పలువురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. తిరుమలాయపాలెం ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న బి.గిరిధర్‌రెడ్డి.. మహబూబాబాద్ జిల్లా గూడూరు పోలీసుస్టేషన్ ఎస్‌హెచ్‌వోగా, ఖమ్మం రూరల్ ఎస్‌ఐ 2గా ఉన్న పోలోజు కుషకుమార్.. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ ఎస్‌హెచ్‌వోగా, వరంగల్ జిల్లా పెద్దవంగర ఎస్‌హెచ్‌వోగా ఉన్న బి.మహేష్‌ను ఖమ్మం వీఆర్‌కు బదిలీ చేశారు.




మణుగూరు సింగరేణి ఓసీ -2 ఓబీ కుప్పల నుంచి కోత కోసుకుంటూ వస్తున్న వరద నీరు


సత్తుపల్లి మండలంలో అలుగుపారుతున్న బేతుపల్లి చెరువు


భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి

విడవని వాన

ఉమ్మడి జిల్లాను మూడు రోజులుగా ముంచెత్తుతున్న వర్షాలు

- చర్లలో అత్యధికంగా 15 సెం.మీ. వర్షపాతం
- పలుచోట్ల పొంగి ప్రవహిస్తున్న వాగులు
- చెరువులు, రిజర్వాయర్లకు జలకళ
- భద్రాచలం వద్ద 35 అడుగులు దాటిన గోదావరి
- తాలిపేరు, కిన్నెరసాని ప్రాజెక్టుల గేట్ల నుంచి కొనసాగుతున్న నీటి విడుదల
- సింగరేణి ఓసీ గనుల్లో నిలిచిపోయిన బొగ్గు ఉత్పత్తి

ఖమ్మం, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) /కొత్తగూడెం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో శనివారం కూడా ఎడతెగని వర్షం కురిసింది. రోజంతా ముసురు పెట్టడంతో జనం ఇళ్లకే పరిమితమయ్యారు. ఖమ్మం జిల్లాలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జిల్లాలో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. జిల్లాలో 4.9 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా వేంసూరులో 7.9 సెంటీమీటర్ల వర్షం కురిసింది. కామేపల్లి మండలంలో 7.6, సింగరేణి 6.8 సెం.మీ. వర్షం కురిసింది. మిగిలిన అన్ని మండలాల్లోనూ 3 సెం. మీ.పైనే వర్షం కురిసింది. అలాగే లంకాసాగర్, వైరా, బేతుపల్లి రిజర్వాయర్లలోకి నీరు చేరడంతో జలకళ కనిపిస్తున్నది. వరుస భారీ వర్షాలతో జిల్లాలోని వాగులు, చెరువులు పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రాజెక్టుల్లోకి నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తల్లాడ మండలంలోని పలు చెరువులు నిండుకుండలను తలపిస్తున్నాయి. మండలంలో మాచవరం వాగు, గంగదేవిపాడు వాగు, కట్టలేరు, బంధం వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మండలంలోని వెంకట్రాముని తండాలో వరదనీరు ఇళ్లలోకి చేరడంతో పలు కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏన్కూరులో భారీవర్షం కురిసింది. వర్షం కారణంగా ఏన్కూరు, కొణిజర్ల మండలం గుబ్బగుర్తి రోడ్డుకు గోతులు ఏర్పడ్డాయి. వరుస వర్షాలతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. వాగుల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ శనివారం విస్తారంగా వర్షాలు కురిశాయి. జిల్లాలో 4.5 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. చర్ల మండలంలో అత్యధికంగా 15 సెంటీమీటర్ల వర్షం కురిసింది. దుమ్ముగూడెం 9, పినపాక 6, మణుగూరులో 7, జూలూరుపాడులో 7 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఎగువన కురిసిన వర్షాలతో జిల్లాలోని నదులు, ఏర్లు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. పాల్వంచలోని కిన్నెరసాని ప్రాజెక్టు నీటిమట్టం 403.20 అడుగులకు చేరింది. ఈ జలాశయానికి 5వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 4 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతోంది. శనివారం సాయంత్రం 6 గంటలకు 35.30 అడుగులకు చేరిన నీటిమట్టం రాత్రి వరకు 40 అడుగులకు పెరిగే అవకాశం ఉంది. చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు 25 గేట్లు ఎత్తి 1.27 లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. అశ్వారావుపేటలోని పెద్దవాగు ప్రాజెక్టుకు గురువారం రాత్రి 3 గండ్లు పడటంతో నీరు మొత్తం బయటకు వెళ్లిపోగా, గుమ్మడివల్లి, కొత్తూరు గ్రామాలను వరదనీరు ముంచెత్తిన విషయం విదితమే. ఆయా గ్రామాల్లో ఇళ్లు బురదమయం కావడంతో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఇక జిల్లా వ్యాప్తంగా ఎడతెరపి లేని వర్షాలతో సుజాతనగర్ మండలంలోని సింగభూపాలం చెరువు, అశ్వాపురంలోని తుమ్మల చెరువు అలుగు పడింది. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో సింగరేణి ఓసీ గనుల్లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. సుమారు లక్ష టన్నుల ఉత్పత్తి నిలిచిపోయినట్టు సమాచారం. జిల్లాలో కొత్తగూడెం మండలంలోని నారాయణపురం, కొత్తూరు, గుమ్మడివల్లి గ్రామాల్లో దెబ్బతిన్న పంటలపై వ్యవసాయ అధికారులు సర్వే చేపట్టి పంటనష్టం అంచనా వేస్తున్నారు. వర్షాలు, వరదల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు సూచించారు. దుమ్ముగూడెం మండలంలో గుబ్బలమంగి, సీత వాగులు పొంగి ప్రవహించడంతో పలుచోట్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పర్ణశాలలో సీతమ్మ నారచీరల ప్రాంతం నీట మునిగింది.

ఉమ్మడి జిల్లాలో జలాశయాలు... ప్రస్తుత నీటి మట్టాలు... (అడుగుల్లో)

	ప్రస్తుత నీటిమట్టం	గరిష్ట నీటిమట్టం
వైరా రిజర్వాయర్	10.60	18.30
పాలేరు రిజర్వాయర్	05.70	23.00
లంకాసాగర్ చెరువు	16.00	16.00
బేతుపల్లి చెరువు	16.00	16.00
కిన్నెరసాని ప్రాజెక్టు	402.80	407
చిన్నగుబ్బలమంగి ప్రాజెక్టు	12.00	12.00
రోళ్లపాడు చెరువు	15.00	18.00
మూకమామిడి ప్రాజెక్టు	27.00	27.00
తాలిపేరు ప్రాజెక్టు	72.54 మీటర్లు	74.00 మీటర్లు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి... : కలెక్టర్



కొత్తగూడెం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల వలన భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం శనివారం సాయంత్రం 4 గంటలకు 34.90 అడుగులకు చేరిందని ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వీ. పాటిల్ సూచించారు. భద్రాచలం నుంచి 5 లక్షల 89 వేల 743 క్యూసెక్కుల నీరు విడుదలవుతుందని, అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇండ్ల నుంచి బయటకు రావద్దని తెలిపారు. అత్యవసరమైన సేవలకు కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయాలని సూచించారు. వరద ప్రవాహాన్ని దృష్టిలో ఉంచుకుని అత్యవసర సేవలకు కొత్తగూడెం కంట్రోల్ రూం ఫోన్ నెంబర్లు 08744-241950, వాట్సాప్ నెంబర్ 93929-19743లను సంప్రదించాలన్నారు.

'పెదవాగు' బాధితులను ఆదుకుంటాం...

- రాష్ట్ర విభజన తర్వాత ప్రాజెక్టు నిర్వహణపై నిర్లక్ష్యం
- జరిగిన నష్టాన్ని సీఎం దృష్టికి తీసుకువెళ్లాం
- ఇరు రాష్ట్రాల సమన్వయంతో మరమ్మతులు చేపడతాం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఖమ్మం, జూలై 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అశ్వారావుపేట మండలంలో పెదవాగు ప్రాజెక్టుకు గండి కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని, జరిగిన నష్టంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విన్నవించడం జరిగిందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. నష్టపోయిన రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుకోసం ఇన్‌పుట్ సబ్సిడీపై రైతులకు కావాల్సిన సహకారం అందిస్తామని, ఆస్తితోపాటు పంటలు నష్టపోయిన వారికి ప్రభుత్వం అన్నివిధాల అండగా ఉంటుందని తుమ్మల తెలిపారు. ప్రాజెక్టు మరమ్మతుల కోసం రెండు రాష్ట్రాల ప్రభుత్వాల సమన్వయం ద్వారా నిధులు కేటాయించి పనులు చేయిస్తామని చెప్పారు.

పెదవాగు ప్రాజెక్టు 1981లో పూర్తయిందని రాష్ట్ర విభజన తర్వాత ప్రాజెక్టు తెలంగాణలో, ఆయకట్టు ఆంధ్రాలో ఉండడం గత ప్రభుత్వాలు ప్రాజెక్టు మరమ్మతులు చేపట్టలేదని తెలిపారు. గురు, శుక్రవారాల్లో గుబ్బలమంగమ్మ అటవీ ప్రాంతంలో 31 సెం.మీ. వర్షపాతం కురవడం, 80 వేల క్యూసెక్కుల వరదనీరు పోటెత్తడంతో పెదవాగు ప్రాజెక్టుకు మూడు చోట్ల గండి పడిందని, వరదనీరు సమీపంలోని గుమ్మడివల్లి, కొత్తూరు, నారాయణపురం గ్రామాలతోపాటు వేలేరుపాడు మండలంలోని పలు గ్రామాలను ముంచెత్తిందని తెలిపారు. 1989లో కూడా ప్రాజెక్టుకు గండి పడిందని, మళ్లీ భారీవర్షాలతో ఈ సారి గండి పడిందని, గత ప్రభుత్వాల సమన్వయ లోపం వల్ల ప్రాజెక్టుకు మరమ్మతులు చేపట్టలేదని తెలిపారు. ఇంత పెద్ద వరదవచ్చినా 30 మంది ప్రాణాలను కాపాడడం జరిగిందని తుమ్మల తెలిపారు.


పెదవాగు ప్రాజెక్టు గండిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే మెచ్చా

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే గండి

- మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు
- బాధితులకు ఫోన్‌లో కేంద్ర మంత్రుల పరామర్శ
- గుమ్మడివల్లి, కొత్తూరులో ఆర్డీవో మధు పర్యటన

6


ఏన్కూరులో భారీవర్షంతో నీటమునిగిన పత్తిచేను


వైరా రిజర్వాయర్‌కు జలకళ


లంకాసాగర్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్

పుణ్య వనిత.. ధన్య చరిత...

- నేడు భద్రాచలంలో దమ్మక్క సేవాయాత్ర
- ఏర్పాట్లు పూర్తి చేసిన దేవస్థానం అధికారులు



భద్రాచలం, జూలై 20: భద్రాచల క్షేత్రంలో అపర రామభక్తురాలుగా పేరుపొందిన పోకల దమ్మక్క సేవాయాత్ర ఆదివారం నిర్వహించనున్నారు. దమ్మక్కకు స్మృతిగా భద్రాచల ఆలయంలో ఇటీవల దమ్మక్క చిహ్నాన్ని కూడా ఏర్పాటు చేశారు. దేవస్థానం పరిధిలోని అన్నదాన సత్రానికి పోకల దమ్మక్క పేరు పెట్టారు. అలాగే ఆ మహా వనితను సంస్మరిస్తూ ప్రతి ఆషాఢ పూర్ణిమ రోజు భద్రాచలంలో అంగరంగ వైభవంగా దమ్మక్క సేవాయాత్రను నిర్వహిస్తారు.

11వ సారి నిర్వహణ

భద్రగిరిలో 11వసారి నేడు దమ్మక్క సేవాయాత్ర నిర్వహించనున్నారు. 2014లో అప్పటి రెవెన్యూ, దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి, స్పెసిఫైడ్ అథారిటీ చైర్మన్ వినోద్‌కుమార్ అగర్వాల్ భద్రాద్రి దేవస్థానం ఆధ్వర్యంలో ఏటా దమ్మక్క పేరిట సేవాయాత్ర నిర్వహించాలని ప్రతిపాదించారు. అప్పటినుంచి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈసారి చర్ల మండలం ఆర్.కొత్తగూడెం గ్రామంలోని శ్రీరామాలయంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు చర్యలు చేపట్టారు. ఇందుకోసం పర్యవేక్షకులు నిరంజన్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు కె.రామస్వరూప్ రాఘవాచార్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలను నిర్వహించేందుకు ఇప్పటికే దిశ నిర్దేశం చేశారు. ఇందుకోసం మొత్తం 14మంది వైదిక పరిపాలన సిబ్బందిని కేటాయించారు. ఆషాఢ పూర్ణిమ రోజున ఆదివారం భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో దమ్మక్క చిత్రపటంతో గిరిప్రదక్షిణ నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

'రుణమాఫీ'పై గందరగోళం

- తొలివిడతలో లక్ష లోపు ఉన్నవారికే మాఫీ
- వీరి సంఖ్య జిల్లావ్యాప్తంగా తక్కువ
- తమకు అందలేదంటూ పలువురి ఫిర్యాదు
- రెండోవిడత కోసం రైతుల ఎదురుచూపులు
- రూ.2లక్షల రుణమాఫీ తర్వాతనే తేలనున్న లెక్క


కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ వద్ద రైతులు, అధికారులు

ఖమ్మం, జూలై 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రుణమాఫీ మూడు విడతలుగా జరగబోతున్న నేపథ్యంలో రైతుల్లో కొంత గందరగోళం నెలకొంది. మొదటి విడతలో లక్ష లోపు వారికి మాత్రమే రుణమాఫీ అయింది. ఖమ్మం జిల్లాలో రూ.లక్ష రుణమాఫీ కింద 5 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 57,857 మందికి తొలివిడత మాఫీచేశారు. ఇందులో ఖమ్మం నియోజకవర్గంలో 2189, పాలేరులో 13,424, మధిరలో 15,760, సత్తుపల్లిలో 16,043, వైరాలో 8,673, ఇల్లెందు నియోజకవర్గంలోని కామేపల్లిలో 1,768మందికి రుణమాఫీ చేశారు. అయితే కుటుంబంలో వివిధ బ్యాంకుల్లో భార్యాభర్తలు, కుమారుడు పలువురికి పలుచోట్ల రుణం తీసుకున్నప్పటికీ లక్షరూపాయల లోపు ఒకరికి మాత్రమే రుణమాఫీ చేశారు.

రెండో విడతగా లక్షన్నరలోపు, మూడోవిడతగా రెండు లక్షల వరకు రుణమాఫీ చేయనున్నారు. ఉదాహరణకు ఖమ్మం అర్బన్ మల్లెమడుగు క్లస్టర్‌లో 1,345మంది రైతులు.. 3770ఎకరాల భూమి సాగవుతుండగా లక్షలోపు రుణం ఉన్న 46 మందికి మాత్రమే రుణమాఫీ జరిగింది. అయితే మరికొందరికి అర్హతలు ఉన్నా రుణమాఫీ కాలేదు. దీంతో పదిమంది రైతులు వచ్చి ఏఈవోను అడగడం జరిగింది. అయితే వీరికి లక్షరుణం తీసుకుంటే వడ్డీ అదనంగా పెరగడం వల్ల లక్షన్నరలోపు రుణమాఫీలో వర్తించే అవకాశం ఉంది. కొణిజర్ల మండలం తనికెళ్ల క్లస్టర్‌లో సుమారు 3వేల మంది రైతులుంటే 541మందికి మాత్రమే లక్షరూపాయల మాఫీ వర్తించింది. అయితే రైతులు రుణమాఫీ అర్హత ఉండి జాబితాలో లేనివారు గ్రామాల్లోని ఏఈవోలను, మండల అధికారులను సంప్రదిస్తున్నారు. మరోవైపు సొసైటీల్లో కూడా కొంత గందరగోళం కనిపిస్తోంది. తమకు అర్హత ఉన్నా రుణమాఫీ జరగలేదని సహకార సంఘాల అధ్యక్షులకు, సీఈవోలకు రైతులు తమ గోడు చెప్పుకుంటున్నారు. వ్యవసాయాధికారులకు కూడా విన్నవించుకుంటున్నారు. కాగా శనివారం నుంచి ఖమ్మం కలెక్టరేట్‌లో 1950 లేదా 9063211298 టోల్‌ఫ్రీ నెంబర్‌కు రైతులు ఫిర్యాదులు చేస్తున్నారు. శనివారం ఒక్కరోజే 350 వరకు రైతులనుంచి ఫోన్ ద్వారా తమకు రుణమాఫీ అందలేదంటూ కాల్‌చేశారు. ఇందులో 120 మంది వరకు లక్షలోపు రుణ బకాయిలు ఉన్న వారు కాగా, మిగిలినవారు లక్షనుండి 2 లక్షలలోపు రుణం తీసుకున్న వారున్నారు. రైతులు సమాచారం లేక రుణమాఫీ అయిందో లేదో తెలియక ఆందోళన పడుతున్నారు. రెండోవిడత మరో రూ.50వేలు మాఫీ జరిగితే అర్హత ఉండి రుణమాఫీ పొందలేని వారి లెక్క తేలే అవకాశం ఉంది. మరో వైపు రైతుసంఘాలు రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరిస్తున్నారు.

జిల్లాలో రేషన్‌కార్డు లేని వారికి భూపట్టాలు లేనివారికి మాఫీ జరగలేదు. ఏజెన్సీలో చాలామంది రైతులు పహణీల ద్వారా రుణాలు తీసుకున్నారు. సహకార సంఘాల్లో కొన్నేళ్లుగా పహణీల ద్వారా రుణాలు పొందుతున్నారు. అదేఆధారంగా రుణాలు పొందుతున్న రైతులకు పట్టాలు లేకపోవడంతో రుణమాఫీకి అనర్హులయ్యే పరిస్థితి నెలకొంది. గ్రామాల్లో సొసైటీలతోపాటు వాణిజ్య బ్యాంకుల నుంచి రుణాలు పెద్దసంఖ్యలో పొందినా తొలివిడతలో పదుల సంఖ్యలోనే రుణమాఫీ జాబితాలో పేరు ఉండడంతో గందరగోళం కనిపిస్తోంది.

కూసుమంచిలో జూనియర్ కళాశాల

రేపటి నుంచి అడ్మిషన్లు ప్రారంభం

కూసుమంచి, జూలై 20: కూసుమంచి మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభం కానుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత విద్యాసంవత్సరం నుంచే కళాశాల అందుబాటులోకి తేవాలని జీవోలో పేర్కొన్నారు. సోమవారం నుంచి అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. గత ఎన్నికల సందర్భంగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూసుమంచి మండలకేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు మంత్రి మాట నిలుపుకున్నారు. కళాశాలను తాత్కాలికంగా కూసుమంచిలోని గుర్వాయిగూడెం క్రాస్‌రోడ్డులో గల రెవెన్యూ అకాడమీలో ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా భవన నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలిస్తున్నారు. మొదటి దఫాగా రెండు గ్రూపులు ఏర్పాటుచేసి 120మంది విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వనున్నారు. కళాశాల ఏర్పాటు చేయడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'పెదవాగు' బాధ్యులపై చర్యలకు ప్రతిపాదనలు

నలుగురు ఇరిగేషన్ అధికారులకు మెమోలు జారీ

అశ్వారావుపేట, జూలై 20: ఇటీవల కురిసిన భారీవర్షాలతో భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలంలో పెదవాగు ప్రాజెక్టు కట్ట తెగిపోయిన ఘటనలో బాధ్యులపై చర్యలకు ఆ జిల్లా ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ ప్రభుత్వానికి నివేదిక పంపించారు. పెదవాగు ప్రాజెక్టు విషయంలో విధులపట్ల నిర్లక్ష్యం వహించారనే కారణంతో ఈఈ సురేష్‌కుమార్, అశ్వారావుపేట డీఈఈ క్రిష్ణ, ఏఈఈ కృష్ణలపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర నీటి పారుదలశాఖ కార్యదర్శికి భద్రాద్రి జిల్లా ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి నివేదిక పంపారు. దీనికంటే ముందు సదరు అధికారులను మెమోలు జారీ చేసిన వివరణ తీసుకున్నారు. చీఫ్ ఇంజనీర్ పంపిన నివేదికపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.



గాంధీచౌక్ సాయిబాబా దేవాలయంలో శ్రీవెంకటేశ్వర కళ్యాణోత్సవం

గాంధీచౌక్ సాయిబాబా దేవాలయంలో ఘనంగా శ్రీవెంకటేశ్వర కల్యాణం

ఖమ్మంసాంస్కృతికం, జూలై 20: రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర శనివారం ఖమ్మం గాంధీచౌక్‌లోని వరప్రదాత షిర్డీ సాయిబాబా దేవాలయాన్ని సందర్శించారు. గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా నిర్వహించిన భూదేవి, శ్రీదేవి సమేత శ్రీవెంకటేశ్వర కల్యాణోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులలో ఆధ్యాత్మికతను పెంపొందించేలా సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పేలా వేడుకలు నిర్వహించటం అభినందనీయం అన్నారు. దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా ఆలయకమిటీ ఛైర్మన్ వేములపల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శి అర్వపల్లి నిరంజన్ తదితర కమిటీ సభ్యులు ఎంపీని శాలువాతో ఘనంగా సత్కరించారు. వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. ఎంపీ వెంట బీఆర్ఎస్ నాయకులు శీలంశెట్టి వీరభద్రం, హరీష్ పాల్గొన్నారు. అంతకుముందుగా సాయిబాబాకు తులసీదళ అర్చన చేశారు.

శ్రీకృష్ణసాయి ఆశ్రమంలో..

రంగనాయకుల గుట్టపైగల శ్రీకృష్ణసాయి ఆశ్రమంలో గురుపౌర్ణమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబాకు నవరత్నాలతో సుగంధ ద్రవ్యాలతో, కనకాభిషేకం నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ లగడపాటి రామారావు, కార్యదర్శి సిద్ధంశెట్టి నాగమణి తదితర కమిటీ ప్రతినిధుల నేతృత్వంలో జరిగిన ప్రత్యేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ధరణి కేంద్రాన్ని సద్వినియోగించుకోవాలి

▸ ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



ధరణి ప్రత్యేక కౌంటర్‌ను సందర్శించి వివరాలు అడుగుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, జులై 20: జిల్లాలో రైతులకు ఇబ్బంది లేకుండా ధరణి సంబంధిత సమస్యల పరిష్కారం కోసం ధరణి సహాయ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ధరణి సహాయ కేంద్రాన్ని శనివారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫిర్యాదు దరఖాస్తు నమోదు పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వారం ప్రజావాణిలో భూ వివాదాలకు సంబంధించి, ధరణి సంబంధిత సమస్యల పైనే ఎక్కువ మంది బాధితులు వస్తుండడంతో వాటిని పరిష్కారించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టామని అన్నారు. కలెక్టరేట్ లో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి ధరణిలో తమ సమస్యలకు సంబంధించి రైతులు దరఖాస్తు చేసుకునే సమయంలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సహాయ కేంద్రంలో సమాచారం అందిస్తామని తెలిపారు. రైతు సమస్యను తెలుసుకొని, దానికి ఏఏ పద్ధతిలో దరఖాస్తు చేయాలి, ఏయే ఆధారాలను అందించాలనే విషయాన్ని సిబ్బంది వివరిస్తారు. అలాగే అప్లికేషన్ రిజెక్ట్ కాకుండా రైతులు ప్రతి చిన్న పనికి పదే పదే అధికారుల చుట్టూ తిరగకుండా ఈ విధానాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. మీ సేవా కేంద్రాల ద్వారా రైతులు సరైన నమూనాలో దరఖాస్తు చేసుకోకపోవడం, దరఖాస్తుకు సంబంధించి సరైన ఆధారాలను చూపించక పోవడం వలన అధికారులు పరిశీలన సమయంలో వాటిని తిర్కరిస్తున్నారని దీంతో రైతులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి వస్తోందని, దీనికోసం దరఖాస్తు చేసే సమయంలోనే రైతులను సహాయం అందించేందుకు హెల్ప్ డెస్క్ లు ఉపయోగ పడుతాయని వివరించారు. ధరణి సహాయ కేంద్రంలో రైతులకు అందుబాటులో ఉండేలా కంప్యూటర్ ఆపరేటర్ ను నియమించామని, దరఖాస్తు చేసుకునే విధానంతో పాటు, చేసుకున్న తర్వాత అప్లికేషన్ల స్థితిగతులను కూడా తెలుసుకోవచ్చుని అన్నారు. ఒకవేళ అప్లికేషన్ రిజెక్ట్ అయితే, ఎందుకు రిజెక్ట్ అయిందనే కారణం కూడా సిబ్బంది చెప్పుతారని కలెక్టర్ తెలిపారు. ఈ కేంద్రాన్ని ప్రజలు రైతులు సద్వినియోగించుకోవాలని ఆయన సూచించారు.



మొక్క నాటుతున్న సీపీ సునీల్‌దత్, నిషాశర్మ

కృష్ణప్రసాద్ మెమోరియల్ పాఠశాలలో వనమహోత్సవం

ఖమ్మంక్రైం, జూలై 20: నగరంలోని పోలీసుశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీకృష్ణప్రసాద్ మెమోరియల్ పాఠశాలలో శనివారం వనమహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ ఛైర్‌పర్సన్ నిషాశర్మతో కలిసి సీపీ సునీల్‌దత్ పాఠశాల మైదానంలో మొక్కలు నాటారు. అనంతరం సీపీ మాట్లాడుతూ పచ్చని చెట్లు, ప్రగతికి మెట్లు అని నగరాలు, గ్రామాల్లో పచ్చదనం పెంపొదిస్తే జీవవైవిధ్యంలో సమతుల్యత సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌ఏసీపీ సుశీల్‌సింగ్, ఆర్ఐ కామరాజు, స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరకాజు వనమహోత్సవ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.



లంకాసాగర్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న సీఈ విద్యాసాగర్

అనునిత్యం అప్రమత్తంగా ఉండాలి

చెరువులను పరిశీలించిన సీఈ విద్యాసాగర్

ఖమ్మం కలెక్టరేట్, జూలై 20 :జిల్లాలో గత నాలుగురోజులుగా కురుస్తున్న వర్షాలకు నీటిపారుదల శాఖ అధికారులు, సిబ్బంది అనునిత్యం అప్రమత్తంగా ఉండాలని నీటి పారుదలశాఖ సీఈ విద్యాసాగర్ సూచించారు. శనివారం జిల్లాలోని వివిధ చెరువులు, ప్రాజెక్టులను ఆయన ఐబీ అధికారులు, సిబ్బందితో కలిసి పరిశీలించారు. లంకాసాగర్ ప్రాజెక్టును సందర్శించి అక్కడి కట్టడాలు, కట్టలు, తూములను పరిశీలించారు. జిల్లాలో జలవనరుల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ఖమ్మం సర్కిల్ పరిధిలోని ఖమ్మం, సత్తుపల్లి డివిజన్ పరిధిలో చెరువులు దాదాపు వరదనీటితో నిండిపోయాయని తెలిపారు. ఇప్పటివరకు సర్కిల్ పరిధిలోని 984చెరువులకుగాను 143 చెరువులు పూర్తిగా నూరు శాతం నీళ్ల నిండాయని, 50నుంచి 75శాతం నిండిన చెరువులు251, 25 నుంచి 50శాతం నిండినవి 96 ఉన్నాయి. 25శాతం నిండినవి 470 వరకు ఉన్నట్లు తెలిపారు. ఈ సందర్శనలో డిప్యూటీ సీఈ ధన్‌కుమార్, కల్లూరు ఎస్ఈ ఆనంద్, ఈఈలు శ్రీనివాసరెడ్డి, మంగళపూడి వెంకటేశ్వర్లు,పెనుబల్లి డీఈ రామారావు, ఏఈలు పాల్గొన్నారు.

యాప్‌లో లెక్కలు సరిచేశారు

▸ మిషన్ భగీరథ నల్లాల సర్వేలో మాయాజాలం
▸ కార్యదర్శుల ప్రమేయం లేకుండా 800 నల్లాల చేరిక
▸ క్షేత్రస్థాయి విచారణతో వేల సంఖ్యలో వెలుగు చూసే అవకాశం
▸ ఎంపీడీఓ నివేదికను తొక్కిపెట్టే యత్నం!

దుమ్ముగూడెం జూలై 20: మండలంలో మిషన్ భగీరథ ఇంటింటి నల్లాల సర్వే అడ్డగోలుగా జరిగింది. తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు కొందరు మిషన్ భగీరథ అధికారులు చేసిన యత్నం బట్టబయలైంది. నల్లాలను వేయకుండానే వేసినట్టు బిల్లులు డ్రాచేసిన బాగోతం బయటపడింది. పంచాయతీ కార్యదర్శుల సర్వేను పక్కన పెట్టి కొందరు భగీరథ అధికారులు తమకు తనుకూలంగా పంచాయతీ వర్కర్లను ప్రలోభపెట్టి అదనంగా వేలాది నల్లాలను సర్వే యాప్‌లో అక్రమమార్గంలో చేర్చారు. ఇది తెలిసిన పంచాయతీ కార్యదర్శులు తాము చేసిన వాస్తవ సర్వే వివరాలు, అక్రమమార్గంలో చేర్చిన నల్లాల వివరాలను జోడిస్తూ ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. ఈనెల 18న సర్వే ముగియగా, మిషన్ భగీరథలో వేసినట్టు చెబుతోన్న నల్లాల దొంగ లెక్కలతో సరిపడే విధంగా కొందరు మిషన్ భగీరథ అధికారులు యాప్‌లో దొంగదారిలో వేలాది సంఖ్యలో అదనంగా అప్‌లోడ్ చేయించారు. అయితే తమ ప్రమేయం లేకుండా తమకు ఇచ్చిన యాప్ ద్వారా సుమారు 800నల్లాలను అక్రమ మార్గంలో అప్‌లోడ్ చేశారని స్వయంగా కొందరు కార్యదర్శులు ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. భగీరథ అధికారుల లెక్కల ప్రకారం ఒక్కో నల్లా నిర్మాణ వ్యయం రూ.4500లు కాగా, 800 నల్లాలకు రూ.36లక్షల నిధులు దుర్వినియోగం జరిగినట్లు తెలుస్తోంది. ప్రస్తుతానికి ఇవి బయటపడిన లెక్కలు కాగా, క్షేత్రస్థాయిలో సమగ్ర దర్యాప్తు జరిగితే రూకోట్లలో నిధుల దుర్వినియోగం బయటపడే అవకాశం కనబడుతోంది.

అక్రమంగా చేర్చిన నల్లాల వివరాలివే!

తమ ప్రమేయం లేకుండా మిషన్‌భగీరథ సర్వే యాప్‌లో వందలాది నల్లాలను అదనంగా చేర్చినట్లు కొందరు కార్యదర్శులు గుర్తించారు. ప్రగళ్లపల్లి పంచాయతీలో 200, చిన నల్లబల్లి పంచాయతీలో 134, చినబండిరేవు పంచాయతీలో 112, బీ కొత్తగూడెం పంచాయతీలో 99, సింగవరం పంచాయతీలో 71, గౌరారం పంచాయతీలో 70, గంగోలు పంచాయతీలో 65, పెద నల్లబల్లి పంచాయతీలో 49నల్లాలలను కొందరు మిషన్ భగీరథ అధికారులు అక్రమమార్గంలో అదనంగా యాప్‌లో చేర్చారు. మిషన్ భగీరథలో వేసిన నల్లాలు కాకుండా గతంలో పంచాయతీలు వేసిన నల్లాలను సైతం ఈ లెక్కల్లో చేర్చినట్లు తెలుస్తోంది. ఇద్దరు ముగ్గురు కార్యదర్శులు మాత్రం తమ యాప్ ద్వారా అదనంగా నల్లాలను అక్రమంగా అప్‌లోడ్ చేసినా, చూసీ చూడనట్లు వ్యవహరించారని తెలుస్తోంది.

ఎంపీడీవో నివేదికను తొక్కిపెట్టే యత్నం?

ఎనిమిది వందల నల్లాలను తమ యాప్ ద్వారా అదనంగా అక్రమ మార్గంలో చేర్చారని కొందరు పంచాయతీ కార్యదర్శులు ఇచ్చిన వివరాల నివేదికను డీపీవోకు పంపినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో ముత్యాలరావు తెలిపారు. అయితే ఈ నివేదిక బయటకు రాకుండా ఉండేందుకు అక్రమాల ఆరోపణలున్న కొందరు మిషన్ భగీరథ అధికారులు తీవ్రంగా యత్నిస్తున్నట్టు తెలుస్తోంది. నల్లాలు వేయకుండానే వేసినట్టు నివేదికలు చూపి రూ.లక్షలాది బిల్లులను మంజూరు చేసిన అధికారులపై చర్యలకు పలు వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి.

తేలాల్సిన అంశాలివే...

మిషన్ భగీరథ పథకం కింద మండలంలోని 37 గ్రామపంచాయతీల పరిధిలో మొత్తం 11,900నల్లాలు వేశామని, వాటిలో ఎనిమిది వేల నల్లాలకు బిల్లులు చెల్లించామని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. తాజా పరిణామాలను పరిశీలిస్తే సుమారు నాలుగు వేలకు పైగా నల్లాలు వేయకుండానే లెక్కల్లో చేర్చినట్లు కనబడుతోంది. పంచాయతీల వారీగా క్షేత్రస్థాయిలో అధికారులు సమగ్ర విచారణ జరిపితే నల్లాల పేరిట జరిగిన లక్షలాది రూపాయల కుంభకోణం బయటపడే అవకాశం కనబడుతోంది.

పార్టీ వ్యతిరేకులను పక్కన చేర్చుకోవద్దు

డాక్టర్ మట్టా దయానంద్



సీఎం చిత్రపటానికి పూష్పాభిషేకం చేస్తున్న దృశ్యం

సత్తుపల్లి, జూలై 20: నియోజకవర్గంలో మనకు వ్యతిరేకంగా పనిచేసిన వారిని పక్కన చేర్చుకోవడం మంచి పద్ధతి కాదని కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలోని 398 మంది లబ్ధిదారులకు రూ.1.46కోట్ల విలువైన చెక్కులను ఆయన స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పంపిణీ చేశారు. అదేవిధంగా రుణమాఫీ నిధులు విడుదల చేసిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు తుమ్మల, పొంగులేటి, భట్టిల చిత్రపటాలకు పూలాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధికోసం కష్టపడుతున్నామని, చిన్నచిన్న విబేధాలు ఉంటే వాటిని పక్కనబెట్టి పార్టీకోసం పనిచేయాలని, ప్రతి పథకాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్లితేనే వారికి ప్రభుత్వంపై నమ్మకం కలుగుతుందని, అప్పుడే ఓట్లు వేసే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, జూలై 20: భారీ వర్షాల నేపథ్యంలో ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శనివారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా రెవిన్యూ, మునిసిపల్, పంచాయతీ రాజ్, ఇరిగేషన్ అధికారులకు చేపట్టాల్సిన చర్యలపై కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. డ్రెయిన్స్ లలో నీటి ప్రవాహనికి అడ్డంకులు కలగకుండా ప్రతి డ్రెయిన్‌లో వర్షపు నీరు ఆటంకం లేకుండా ప్రవహించేలా చూడాలన్నారు.

జిల్లాలోని నీటి వనరుల నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. రిజర్వాయర్, చెరువుల నీటి నిల్వలు ఎప్పటికప్పుడు పరిశీలించాలని తెలిపారు. పొంగుతున్న వాగులు, నిండిన చెరువులతో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నీటి ప్రవాహం ఉన్న వంతెనలు, కల్వర్టుల వద్ద రాకపోకలు నిలిపి, బారికేడ్లు, సైన్ బోర్డులు ఏర్పాటుచేయాలని ఆదేశించారు.అధికారులు బాధ్యతతో పర్యవేక్షణ చేయాలన్నారు. కూలిపోయే ఇళ్లలో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు పాఠశాల, గ్రామ పంచాయతీ, ప్రభుత్వ భవనాలను గుర్తించి పునరావాస కేంద్రాల ఏర్పాటు చేయాలన్నారు. పునరావాస కేంద్రాల వద్ద వైద్య శిబిరాల ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ వైర్లు తెగిపోతే వెంటనే మరమ్మతులు చేయాలని, వేలాడే విద్యుత్ తీగలు, ఇండ్ల పై నుండి వెళ్లే తీగలు, రక్షణ లేని ట్రాన్స్ ఫార్మర్ల పట్ల అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, విద్యుత్ షాక్ లతో ఎలాంటి ప్రాణనష్టం వాటిల్లకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్నారు.

పారిశుద్ధ్యం పై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా, చెత్త నిల్వ లేకుండా చూడాలన్నారు. రెవిన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్, విద్యుత్, మునిసిపల్, నీటి పారుదలశాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండి, సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ టెలీ కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య, నీటిపారుదల శాఖ సీఈ విద్యాసాగర్, విద్యుత్ ఎస్ఈ సురేందర్, ఆర్డీవోలు, ఎంపీడీవో లు, తహశీల్దార్లు, మునిసిపల్ కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

పాలేరుకు చేరిన సాగర్ జలాలు



కూసుమంచి, జూలై 20: సాగర్ జలాలు శనివారం అర్ధరాత్రి పాలేరు జలాశయాన్ని తాకాయి. ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలో తాగునీటి అవసరాల నిమిత్తం నాగార్జునసాగర్ డ్యామ్‌నుంచి శుక్రవారం సాగర్ జలాలను విడుదల చేశారు. ఎడమకాల్వకు 5వేల క్యూసెక్కుల నీరు విడుదల చేయగా శనివారం అర్ధరాత్రి దాటాక పాలేరుకు చేరుకున్నాయి. ప్రస్తుతం 300 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి చేరుతున్నాయని తెలిపారు. ఇది మరింత పెరిగే అవకాశం ఉంది. పాలేరు జలాశయంలో 23 అడుగుల గరిష్ఠ నీటిమట్టానికి 5.7 అడుగులమేర నీరు నిల్వ ఉంది.

కొత్తగూడెం డిపో మేనేజర్‌గా దేవేందర్‌గౌడ్



బాధ్యతలు స్వీకరిస్తున్న దేవేందర్‌గౌడ్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై20: కొత్తగూడెం డిపో మేనేజర్‌గా ఎం.దేవేందర్‌గౌడ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో డీఎంగా పని చేసిన బాణాల వెంకటేశ్వరరావు హైదారాబాద్‌లోని బస్సు భవన్‌కు బదిలీపై వెళ్లారు. నూతనంగా డీఎంగా బాధ్యతలు స్వీకరించిన దేవేందర్‌గౌడ్ వనపర్తిలో డిపో చీఫ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై కొత్తగూడెం వచ్చారు. అనంతరం డీ ఎం మాట్లాడుతూ కొత్తగూడెం డిపోను అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు ఉన్నత అధికారుల ఆదేశాలనుసారం పని చేస్తానని హామీ ఇచ్చారు. ఉద్యోగులతో సమన్వయం చే సుకుంటూ డిపో ఆదాయానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు.



సత్తుపల్లి: రుద్రాక్షపల్లి శివారులో చిన్నవాగు దాటుతున్న స్థానికులు



మధిరటౌన్: శివాలయం వద్ద ఉధ్రుతంగా ప్రవహిస్తున్న వైరా నది



వేంసూర్: కాల్వలో పూడిక తొలగింపు చర్యలు చేపట్టిన రైతులు

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే గండి

▸ ఇళ్లు కోల్పోయిన వారికి రూ.5లక్షలు, ఎకరానికి రూ.50వేల పరిహారం ఇవ్వాలి
▸ మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు
▸ బాధితులతో కేంద్ర మంత్రులచే ఫోన్‌లో మాట్లాడించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు కిరణ్



బాధితులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు

అశ్వారావుపేట రూరల్, జూలై 20: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అశ్వారావుపేట మండలం గుమ్మడివల్లి సమీపంలో పెదవాగు ప్రాజెక్టుకు పడిన గండిని శనివారం మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రంగా కిరణ్‌లు వేర్వేరుగా పరిశీలించారు. ఈ సందర్భంగా మెచ్చా మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ముఖ్యమంత్రి జలగం వెంగళరావు నిర్మించిన పెదవాగు ప్రాజెక్టుకు గండి పడటం బాధాకరమని, ప్రస్తుత ప్రభుత్వ నిర్లక్ష్యం వలనే భారీ గండి పడి ఊహించని నష్టం వాటిల్లిందన్నారు. వరదల వలన ఇళ్లు కోల్పోయిన వారికి రూ.5 లక్షలు, పంటనష్టం జరిగిన ప్రతి ఎకరానికి రూ.50 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మాజీ ఎమ్మెల్యే తాటి గుమ్మడివల్లి గ్రామంలో బాధితుల ఇళ్లకు వెళ్లి జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. పంటలు, గొర్రెలు, మేకలు, పశువులు కోల్పోయిన వారికి తక్షణమే సాయం అందించాలన్నారు. రైతులు పంటలు పండించే వరకు ఉపాధి కల్పించాలని కోరారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రంగా కిరణ్ స్థానిక నాయకులతో కలిసి నారాయణపురం, గుమ్మడివల్లి ప్రాంతాల్లో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. బాధిత రైతులతో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, బీజేపీ అగ్రనేత పొంగులేటి సుధాకర్‌రెడ్డిలచే ఫోన్‌లో మాట్లాడించారు. పొలాల్లో ఇసుక మేటలు తొలగించి పంటలు వేసుకునేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని కిరణ్ కోరారు.

బాధితులకు ఆర్థిక సాయం మంజూరు

పెదవాగు ప్రాజెక్టును శనివారం కొత్తగూడెం ఆర్డీవో మధు సందర్శించారు. గండిపడిన ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును స్థానిక అధికారుల ద్వారా తెలుసుకున్నారు. అనంతరం గుమ్మడివల్లి, కొత్తూరు గ్రామాల్లో దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. గ్రామస్తులతోనూ, పంటలు కోల్పోయిన రైతులతో మాట్లాడారు. పూర్తిగా 44 ఇళ్లు , పాక్షికంగా 21 ఇళ్లు, 42 పశువుల కొట్టాలు దెబ్బతిన్నట్లుగా గుర్తించామని తెలిపారు. పూర్తిగా దెబ్బతిన్న గుడిసెలకు రూ.4100, పాక్షికంగా దెబ్బతిన్న పక్కా గృహాలకు రూ.5200, కచ్చా ఇళ్లకు రూ.3200, పశువుల కొట్టాలకు రూ.2100 చొప్పున ప్రభుత్వ ఆదేశాల మేరకు నష్టపరిహారం కింద రూ.3,94,700 మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. వరద బాధితులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించటం జరిగిందని వివరించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ కృష్ణప్రసాద్, ఇతర అధికారులు ఉన్నారు.



దెబ్బతిన్న ఇళ్లను పరిశీలిస్తున్న అధికారులు



ఫోన్‌లో కేంద్ర మంత్రులకు వివరిస్తున్న రంగాకిరణ్

ప్రజా పంపిణీ వ్యవస్థ మెరుగుపడాలి

● అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సమీక్ష

ఖమ్మం కలెక్టరేట్, జూలై 20:జిల్లాలోని అన్ని రేషన్ దుకాణాల్లో ప్రజాపంపిణీ వ్యవస్థ మెరుగుపడాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు. డీలర్లు సమయపాలన పాటించి ప్రజలకు రేషన్ సరుకులు సకాలంలో అందించాలని సూచించారు.శనివారం ప్రజ సమావేశ మందిరంలో సత్తుపల్లి, తల్లాడ ,కల్లూరు, ఎర్రుపాలెం, పెనుబల్లి, వేంసూరు, మధిర, బోనకల్లు, వైరా మండలాలకు సంబంధించిన డీలర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా డీలర్లు అందరూ సమయపాలన పాటిస్తూ లబ్ధిదారులకు రేషన్ సరుకులు సరఫరా చేయాలని ఆదేశించారు. స్టాక్ రిజిస్టర్ లో స్టాక్ వివరాలను అప్డేట్ చేయాలని, ఆథరైజేషన్ లో ఉన్న నామినీలు మాత్రమే సహాయకరంగా ఉండాలని ఆదేశించారు. ప్రతి చౌక ధరల దుకాణం డీలర్ ఎంఎల్ఎస్ పాయింట్‌లో కాటా సరి చూసుకొని సరైన తూకంతో రేషన్ బియ్యం లోడు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి చందన్ కుమార్, జిల్లా రేషన్ డీలర్ల అధ్యక్షుడు బానోత్ వెంకన్న, షేక్ జామియా, డీలర్లు పాల్గొన్నారు.

రుణమాఫీ అనుమానాలపై ఆరా...!

ఒక్క రోజులోనే 350 కాల్స్

ఖమ్మం కలెక్టరేట్, జూలై20: తెలంగాణ ప్రభుత్వం పంటరుణ మాఫీపై రైతులకు అనుమానాల నివృత్తి కోసం ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన సహాయక కేంద్రానికి ఫోన్ కాల్స్ వెల్లువలా వస్తున్నాయి. జిల్లాలో రైతులకు రుణమాఫీ వర్తింప చేసినప్పటికీ ఇంకా ఎంతో మంది అర్హత ఉండి రుణమాఫీ సమాచారం తెలియక పోవడంతో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సహాయక కేంద్రానికి ఫోన్ చేసి తమ అనుమానాలను అడిగి తెలుసుకుంటున్నారు. రుణమాఫీ అమలు తర్వాత శుక్రవారం సాయంత్రం హెల్ప్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శనివారం సాయంత్రం వరకు 350 ఫోన్ కాల్స్ వచ్చాయి. అయితే కొందరు రైతులు నేరుగా కలెక్టరేట్‌కు వచ్చి తమకు రుణమాఫీ వర్తించిందా లేదా అని అడిగితెలుసుకుంటున్నారు. దీంతో అధికారులు బిజీబిజీగా కనిపించారు.

గరీబ్‌పేటలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలి

● జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు వీరభద్రం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై20: గరీబ్‌పేట ప్రాంతంలో సీజనల్ వ్యాధులను నివారించేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చొరవ చూపించి ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని జన విజ్ఞానవేదిక భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు కె.వీరభద్రం కోరా రు. శనివారం ఐడీవోసీలోని కలెక్టర్ ఛాంబర్‌లో వినతి పత్రాన్ని అందజేసి వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు రమేష్ కుమార్‌మక్కడ్, సుబ్బారావు, వెంకటేశ్వరరావు, కొల్లు నాగేశ్వరరావు, రామలక్ష్మి, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన కారేపల్లి ఎంపీపీ

కారేపల్లి, జూలై20: మండలంలో బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగిలింది. మండల ఎంపీపీ మాలోత్ శకుంతల, ఆమె భర్త చీమలపాడు గ్రామ మాజీ సర్పంచ్ కిషోర్‌తో పాటు పలువురు బీఆర్ఎస్‌ను వీడి శుక్రవారం రాత్రి వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ క్యాంప్ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ దుర్గాప్రసాద్‌రావు సమక్షంలో పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎంపీపీ దంపతులు మాట్లాడుతూ మండలంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తామన్నారు.



గ్యాస్ సబ్సిడీ..నో!

» ఖాతాల్లో జమకాని రాయితీ » మహాలక్ష్మి లబ్ధిదారుల ఆందోళన » బ్యాంకులు, గ్యాస్ ఏజెన్సీల చుట్టూ ప్రదక్షిణలు

మధిర, జూలై 20: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా ప్రకటించిన రూ.500లకే గ్యాస్ సబ్సిడీ పథకం పూర్తి స్థాయిలో అమలుకు నోచుకోవడంలేదు. మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం సదుపాయం కల్పించిన ప్రభుత్వం, మహిళలకు మరింత ఊరట కల్పించేందుకు మహాలక్ష్మి పథకం పేరుతో రూ.500లకే గ్యాస్ పథకం తీసుకొచ్చింది. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పాటు గ్యాస్ బండ ధర సామాన్యుడికి భారంగా మారింది. ఈతరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.500లకే గ్యాస్ సిలెండర్ పథకం ప్రజలకు మరింత ఊరటనిచ్చింది. ఇందుకు ఎన్నికల ముందు కొంత డబ్బులు గ్యాస్ ఏజెన్సీలకు ప్రభుత్వం నేరుగా జమచేసింది. ఆతర్వాత ఎన్నికల కోడ్ రావడంతో పథకం అమలు ఆగిపోయింది. ఆతర్వాత గ్యాస్ సిలెండర్ తీసుకొన్న వారికి గ్యాస్ సబ్సిడీ రావడం లేదని వాపోతున్నారు. ప్రస్తు తం ఎన్నికల కోడ్ ముగిసిపోయి నెల రోజులు అయింది. అయినా గ్యాస్ సబ్సిడీ పథకం నిధులు ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో అందరికీ గ్యాస్ సబ్సిడీ అందడం లేదని వాపోతున్నారు.

సబ్సిడీ కోసం ఎదురుచూస్తున్న 4లక్షల మంది

ఖమ్మం జిల్లాలో గ్యాస్ పథకం కింద హెచ్‌పీ, ఇండియన్, భారత్ తదితర గ్యాస్ కంపెనీలకు చెందిన ఏజెన్సీలు వినియోగదారులకు గ్యాస్ సిలెండర్లు సరఫరా చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 4.10 లక్షల కనెక్షన్లు ఉన్నాయి. సబ్సిడీ పథకం కింద 20కోట్ల వరకు ప్రభుత్వం గ్యాస్ ఏజెన్సీలకు చెల్లించాల్సివుంటుంది. ఎన్నికల ముందు వచ్చిన డబ్బులు తప్ప ఎన్నికల అనంతరం ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో ఈపథకం సబ్సిడీ రాక గ్యాస్ వినియోగదారులు లబోదిబోమంటున్నారు. నాలుగు లక్షల మంది గ్యాస్ సబ్సిడీ కోసం ఎదురు చూస్తున్నారు.

మధిర నియోజకవర్గంలో 71,193 గ్యాస్ కనెక్షన్లు

మధిర నియోజకవర్గంలోని మధిర, రూరల్, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ మండలాల్లో హెచ్పీ, ఇండియన్, భారత్ గ్యాస్ ఏజెన్సీలు ఉన్నాయి. వీటి ద్వారా 71,193 గ్యాస్ కనెక్షన్లకు ప్రతి నెల గ్యాస్ సిలెండర్లు సరఫరా జరుగుతుంది. వీటిలో సింగిల్ సిలెండర్ కనెక్షన్లు 32,622, డబుల్ సిలెండర్ గ్యాస్ కనెక్షన్లు 13,698 ఉండగా, దీపం పథకం కింద 9683 కనెక్షన్లు, కేంద్ర ప్రభుత్వం ఉజ్వల పథకం కింద 12,725 కనెక్షన్లు సీఎస్ఆర్ పథకం కింద 2,465 కనెక్షన్లు ఉన్నాయి. మొత్తం 71,193 కనెక్షన్లకు ప్రతి నెల సిలెండర్లు పంపిణీ జరుగుతుంది. ప్రస్తుతం గృహ గ్యాస్ సిలెండర్ ధర రూ.825.50 లు గా ఉంది. ఈ మొత్తం వినియోగదారులు ముందుగా చెల్లించి గ్యాస్ తీసుకొంటే తర్వాత రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీగా రూ.310, కేంద్ర ప్రభుత్వం రూ.15లు సబ్సిడీగా గ్యాస్ ఏజెన్సీలకు ఇస్తా యి. వీటిని గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారుడి బ్యాంకు ఖాతాలకు జమచేస్తారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ రూ.15లు మాత్రమే జమ అవుతుందని వినియోగదారులు తెలుపుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ రూ.310లు రావడం లేదు. ఈవిషయమై గ్యాస్ ఏజెన్సీల వారు సబ్సిడీ జమ విషయాలు తమకు తెలియవని, యథావిధిగా వారి బ్యాంకుల్లో జమఅవుతాయని తెలుపుతున్నారు. సివిల్ సప్లయిస్ అధికారులను అడిగితే ఏజెన్సీలకు ప్రభుత్వం నేరుగా డబ్బులు ఇస్తుందని, ఆ వివరాలు తమకు తెలియవని చెబుతున్నారు. అసలు విషయం ఆరా తీస్తే ఎన్నికల తర్వాత ప్రభుత్వం సబ్సిడీ నిధు లు రావడం లేదని తెలుస్తోంది. తొలి విడతలో వచ్చిన డబ్బుల వరకు వినియోగదారుల బ్యాంక్ ఖాతాల్లో జమచేశారు. ఆతర్వాత నిధులురాక ఆగినట్లు సమాచారం. దీంతో చాలా మంది గ్యాస్ పథకం సబ్సిడీకి నోచుకోవడంలేదు. ఎన్నికల తర్వాత ఆగిపోయిన గ్యాస్ సబ్సిడీ పథకం డబ్బులు ప్రభుత్వం వెంటనే అందజేయాలని గ్యాస్ వినియోగదారులు కోరుతున్నారు.

ఆర్మీ జవాన్ బాలాజీ అంత్యక్రియలు



బాలాజీ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాందాస్

కారేపల్లి, జూలై20: మండల పరిధిలోని బాగ్యనగర్‌తండాకు చెందిన ఆర్మీ జవాన్ తేజావత్ బాలాజీ అంత్యక్రియలు శనివారం ఆర్మీఅధికారుల సమక్షంలో అధికారికంగా నిర్వహించారు. జ్వరంతో బాధపడుతూ హైదరాబాద్‌లో శుక్రవారం మృతి చెంది న బాలాజీ మృతదేహాన్ని శనివారం భాగ్యనగర్‌కు తీసుకువచ్చారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాసు నాయక్ భౌతికాయన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పారా మిలటరీ ఇన్‌స్పెక్టర్ దిలీఫ్‌కుమార్‌తో పాటు ఆర్మీకి చెందిన పలువురు సిబ్బంది నివాళులర్పించారు. అనంతరం అధికార లాంఛనాలతో ఆర్మీ సిబ్బంది గాల్లోకి కాల్పులు జరిపి ఆర్మీ సంప్రదాయలతో బాలాజీ భౌతికాయనికి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు రక్షణ కవచాలు ఇవ్వాలి

» ప్రగతిశీల మునిసిపాలిటీ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డిమాండ్



. ఖమ్మం కేఎంసీ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 20: ఖమ్మంనగరంలో పారిశుధ్య పనులు నిర్వీరామంగా పనిచేస్తున్న కార్మికులకు కనీసం రక్షణ కవచాలు ఇవ్వడం లేదని తెలంగాణ ప్రగతిశీల మునిసిపాలిటీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీ. రామయ్య అన్నారు. శనివారం మునిసిపాలిటీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం కేఎంసీ ఎదుట ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ పారిశుధ్య పనులు చేస్తూ, కాల్వలోకి దిగిన కార్మికుల కాళ్లు, చేతులకు దెబ్బలు తగిలి వర్షాకాలంలో మానని గాయాలుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో కనీసం రెయిన్ కోట్లు, గ్లౌజ్‌లు ఇవ్వాలని కోరారు. అనంతరం అసిస్టెంట్ కమిషనర్‌కు నాయకులు వినతిపత్రం అందించారు. రాష్ట్ర కమిటీ సభ్యులు కిన్నెర నారాయణ, దున్న గురువయ్య, జెట్టి గురవయ్య, ములకలపల్లి లక్ష్మీనారాయణ, కే శ్రీనివాస్, మోహను, ప్రసాద్, బాబురావు, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

ఉర్రూతలూగించిన ధూంధాం...



జ్యోతి ప్రజల్వన చేస్తున్న గాయకులు

ఖమ్మంసాంస్కృతికం, జూలై 20 ప్రముఖ ప్రజాగాయకుడు పాగి వెంకన్న 25 ఏళ్ల పాటల ప్రస్థానాన్ని పురస్కరించుకొని ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో శనివారం నిర్వహించిన పాగిపాటకు పాతికేళ్ల కార్యక్రమంలో కళాకారుల ధూంధాం ఉర్రూతలూగించింది... ప్రముఖ గాయకుడు గిద్దె రామనర్సయ్య తన దళంతో కలిసి పాటలు పాడుతూ సభను హుషారెత్తించారు.. ప్రజా కవి యశ్ పాల్, మేడగాని శేషగిరి, పాగి వెంకన్న , జాన్, తదితరుల పాటలతోపాటు డప్పుకళాకారుల డప్పు మోతతో సభ దద్దరల్లింది... హాస్యనటుడు జబర్దస్త్ ఫేం రాజమౌళి, తనదైన హాస్యం పండించి కడుపుబ్బనవ్వించాడు.

పాట ప్రజాచైతన్యానికి పునాది అని పలువురు వక్తలు అన్నారు.. ప్రముఖ జానపద గాయకుడు పాగి వెంకన్న పాతికేళ్ల పాటల ప్రస్థానం కార్యక్రమం సందర్భంగా చిర్ర రవి అధ్యక్షతన జరిగిన సభలో కార్యక్రమంలో ప్రజా గాయకుడు గిద్దె రామనర్సయ్య, ప్రజా కవి యశ్ పాల్ తదితర పలు సంఘాల నేతలు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంతోపాటు పలు ప్రజా ఉద్యమాలలో పాగి వెంకన్న పాటల పాత్ర క్రియాశీలమైనదన్నారు. ప్రజలను చైతన్యపరిచే అనేక పాటలను వెంకన్న ప్రజాఉద్యమాలకు అందించారన్నారు. కళారంగంలో స్వయం కృషితో అంచెలంచెలుగా ఎదిగిన గాయకుడు వెంకన్న అని కొనియాడారు. ఆర్కెస్ట్రాపై కళాకారుల పాటలు, డప్పుదళాలు, కోలాట, బంజారా నృత్యాలతో కళాకారులు తమ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘం రాష్ట్రనేత లింగాల రవికుమార్, స్వర్ణభాష్కర్, ప్రజా గాయని నిర్మల, అశ్విని, సంగీత దర్శకుడు బల్లేపల్లి మోహన్, తదితరులు పాల్గొన్నారు.

పారపట్టిన ఎస్ఐ సంధ్య



పారపట్టి గుంతలను కంకరతో పూడుస్తున్న టౌన్ ఎస్ఐ సంధ్య

మధిరటౌన్, జూలై20: మధిర టౌన్ ఎస్ఐ సంధ్య శనివారం పార చేత పట్టి స్వయంగా రోడ్డు పైన ఉన్న గుంతలను పూడ్చారు. మధిర లోని విజయ వాడ రోడ్డులోని పెట్రోల్ బంక్ వద్ద ఎదురుగా ప్రధాన రహదారిపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి, ఈ గుంతల్లో ద్విచక్ర వాహన దారులు అనేక మంది పడి గాయాలపాలయ్యారు. దీంతో ఎస్ఐ స్పందించి కంకర తెప్పించి పోలీసులు సహాయంతో స్వయంగా గుంతలను పూడ్చారు. మధిర లోని రైల్వే ఓవర్ బ్రిడ్జి పై కూడా పెద్ద, పెద్ద గుంతలు ఏర్పడి, గత నెలలో అనేక ప్రమాదాలు జరిగి ఓ వ్యక్తి మృతి చెందాడని ఈ గుంతలను కూడా పూడ్చి ప్రమాదాలను నివారిం చాలని ప్రజలు కోరుతున్నారు. స్వయంగా పార బట్టి గుంతలను పూడ్చిన ఎస్ఐను పలువురు అభినందిచారు.

ఏపీపీ అనిల్‌కు వీడ్కోలు

ఖమ్మం లీగల్ జూలై 20: ఖమ్మం రెండవ అదనపు ప్రథమశ్రేణి కోర్టులో ఏపీపీగా పనిచేస్తున్న నర్సింగ్ అనిల్‌కుమార్‌ను కొత్తగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా రెండవ అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి ఏపూరి బింధుప్రియ, న్యాయశాఖ ఉద్యోగులు అనిల్‌కుమార్‌ని ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో న్యాయశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస రాజు తదితరులు పాల్గొన్నారు.



ఏపీపీ అనిల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

డీఎస్సీ పరీక్షకు 312 మంది హాజరు

ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై 20: జిల్లాలో శనివారం నిర్వహించిన డీఎస్సీ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. ఉదయం మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించారు. ఉదయం నిర్వహించిన పరీక్షకు జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాలలో మొత్తం 193 మందికి 148 మంది హాజరుకాగా, 45 మంది అభ్యర్థులు పరీక్షకు హజరుకాలేదని అధికారులు తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన రెండు పరీక్షా కేంద్రాల లో మొత్తం 172 మందికి 164 మంది హాజరుకాగా 8 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకాలేదని తెలిపారు. మొత్తం 365 మందికి గాను 312 మంది పరీక్షకు హాజరై, 53 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకాలేదు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



మురళీ(ఫైల్)

అశ్వారావుపేట రూరల్, జూలై 20: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో శనివారం జరిగింది. ఎస్ఐ శివరామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తూరు గ్రామంలో చాపర్ల వేణు మురళీ(32) వెల్డింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. కాగా గ్రామం లో తాగునీటి పథకం విద్యుత్ మెటారు స్విచ్ ఆన్ చేసే క్ర మంలో విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. వెంటనే అతడిని గుమ్మడివల్లి ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి అశ్వారావుపేటలోని ఆసుపత్రికి తీసుకురాగా పరిక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గ్రానైట్ కార్మికుడు..

ఖమ్మం రూరల్, జూలై 20: ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌తో ఓ గ్రానైట్ కార్మికుడు మృతి చెందిన సంఘటన గుర్రాలపాడులో చోటు చేసుకుంది. పశ్చిమబెంగాల్ రాష్ట్రం, దక్షిణ 24 పరగణాల జిల్లా, ఇంద్రాప్లర్ గ్రామానికి చెందిన కుసద్దజో జానా (20), అతని సోదరుడు కార్తీక్ జానాతో కలిసి కొంత కాలంగా మండల పరిధిలోని గుర్రాలపాడు, ముదిగొండ గ్రామాల పరిధిలోని గ్రానైట్ పరిశ్రమలతో తమ సొంత రోప్‌కటింగ్ మిషన్ ద్వారా బ్లాక్స్ కట్‌చేస్తుంటారు. దీనిలో భాగంగా శుక్రవారం రాత్రి గుర్రాలపాడులోని ఓ గ్రానైట్ పరిశ్రమలో రోప్‌మిషన్‌తో బ్లాక్స్ కటింగ్ చేస్తుండగా, ప్రమాదవశాత్తూ కుసద్దజో జానా విద్యుత్‌షాక్ తగిలి కిందపడిపోయాడు. వెంటనే స్థానికులు ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ ఘటనపై మృ తుడి సోదరుడు కార్తీక్ జానా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాలకు సన్మానం



కొత్వాలను సన్మానిస్తున్న డీసీఎంఎస్ సిబ్బంది

ఖమ్మంవ్యవసాయం, జూలై20: తెలంగాణ రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్‌గా నియమితులైన ఉమ్మడి ఖమ్మం జిల్లా డీసీఎంఎస్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావును డీసీఎంఎస్ పాలకవర్గసభ్యులు సిబ్బంది శనివారం ఘనంగా సన్మానించారు. శనివారం నగరంలోని డీసీఎంఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కొత్వాలను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా డీసీఎంఎస్ అభివృద్ధిపై చర్చించారు. ఈకార్యక్రమంలో డీసీంఎఎస్ డైరెక్టర్లు పరుచూరి రవికుమార్, జక్కుల లక్ష్మయ్య, కుంచవరపు వెంకటేశ్వర్లు, తోళ్ల కోటయ్య, డీసీఎంఎస్ బిజినెస్ మేనజర్ కె.సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

మిర్చి లారీ పట్టివేత..

● నలుగురు వ్యక్తుల అరెస్టు

మణుగూరు, జూలై 20: మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని కమలాపురం గ్రామంలో కొన్ని రోజులుగా ఓ లారీ నిలిపి ఉంచడం పై స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో శనివారం లారీ పై విచారణ చేపట్టిన అధికారులు ఈ లారీ గుంటూరు నుంచి మిర్చి లోడ్‌తో ఇక్కడికి వచ్చినట్లు కనుగొన్నారు. దీనిపై మణుగూరు సీఐ ఎస్ సతీస్‌కుమార్, ఎస్ఐ రంజిత్, సిబ్బంది రంగంలో దిగి గుట్టు రట్టు చేశారు. ఇందుకు సంబంధించి సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం, కృష్ణ, కోనసీమ భద్రాద్రి జిల్లాలకు చెందిన నలుగురు వ్యక్తులు గుంటూరులో మిర్చితో లోడ్ అయి వస్తున్న ఈ లారీని ఓ కారులో వెంబడిస్తూ ఒంగోలులో లారీని నిలిపివేయిస్తారు. డ్రైవర్‌ను బలవంతంగా దింపి వేసి లారీని నేరుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు కమలాపురం గ్రామానికి తరలించారు. దొంగతనంగా ఈ లారీని ఎత్తుకొచ్చినట్లు తమ దర్యాప్తులో వెల్లడి కావడంతో ఈ వ్యవహారంలో భాగస్వాములుగా ఉన్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు మృతి

చర్ల, జులై 20: ఛత్తీస్‌గడ్ రాష్ట్రం సుకుమా జిల్లా జేగురుకొండ అడవుల్లో శనివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక మావోయిస్టు మృతి చెందాడు. జేగురుకొండ అడవుల్లోని సింగవరం, తుమర్ ప్రాంతాల్లో మావోయిస్టులు ఉన్నట్లు సమాచారం అందడంతో డీఆర్‌జీ బలగాలు కూబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక మావోయిస్టు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఎన్‌కౌంటర్ ప్రాంతంలో ఒక తుపాకీ, ఇతర వస్తువులను బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. చనిపోయిన మావోయిస్టుని గుర్తించాల్సి ఉందన్నారు.

మృతదేహం లభ్యం

దుమ్ముగూడెం, జూలై 20: మండల పరిధిలోని సున్నంబట్టి గోదావరి నది ఒడ్డుకు శనివారం ఓ మృతదేహం కొట్టుకొని వచ్చింది. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ములుగు జిల్లా ఆలుబాకకు చెందిన బనారి రాజు(45)గా పోలీసులు గుర్తించారు. ఈనెల 18న ఆలుబాక వద్ద గోదావరిలో చేపల వేటకు వెళ్లిన రాజు గల్లంతయ్యాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

'నవోదయ'...

సమైక్యత బాట..



» పాలేరు నుంచి ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లి వచ్చిన 12 మంది విద్యార్థులు
» సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, జీవన విధానాలపై అవగాహన కల్పించడమే లక్ష్యం
» మైగ్రేషన్ విధానంలో ఏడాది పాటు విద్యాభ్యాసం

కూసుమంచి, జూలై 20: విద్యార్థి దశ నుండే జాతీయ సమైక్యత భావాన్ని పెంపొందించేలా జవహార్ నవోదయ విద్యాలయాల్లో మైగ్రేషన్ విధానాన్ని అమలుచేస్తున్నారు. ఒకప్రాంతం నుంచి మరో ప్రాంతం వెళ్లడం వల్ల అక్కడి సంస్కృతి, సాంప్రదాయాలు, కళలు, జీవన విధానాలు తెలుస్తాయి. చదువుతో పాటు విద్యార్థుల్లో జాతీయ భావం ఇతర భాషల్లో పట్టు పెరుగుతాయి. భవిష్యత్తులో విద్యార్థులు ఇతర ప్రాంతాల్లో, దేశాల్లో ఉపాధి, ఉద్యోగ రంగాల్లో స్థిరపడేందుకు దోహదపడుతుంది. ఖమ్మం జిల్లాలోని పాలేరు జవహార్ నవోదయ విద్యాలయం నుండి 12 మంది విద్యార్థులు ఛత్తీస్‌గడ్ రాష్ట్రంలోని సుకుమా-2 జిల్లాలోని కుంహరాస్ విద్యాలయానికి ఏడాది చదువు కోసం వెళ్లి వచ్చారు. అక్కడ విద్యార్థులు నేర్చుకున్న విషయాలను ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు.

కేంద్రప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న జవహార్ నవోదయ విద్యాలయంలో ఏటా 9వ తరగతి విద్యార్థుల్లో 15 శాతం విద్యార్థులను మైగ్రేషన్ కింద చత్తీస్‌గడ్‌లోని సుకుమా పాఠశాలకు వెళ్లాలి. పాలేరులో చదువుతున్న 80 మంది విద్యార్థుల్లో 12 మంది రిజర్వేషన్లు నిబంధనల ప్రకారం లక్కీడిప్ ద్వారా ఎంపిక చేస్తారు. 2023-24 సంవత్సరంలో 9వతరగతికి చెందిన విద్యార్థులు మైగ్రేషన్‌పై ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లాలోని కుంహరాస్ విద్యాలయానికి వెళ్లి అక్కడ చదువు పూర్తి చేసుకుని ఇటీవల ఇక్కడకు వచ్చారు. కొందరు విద్యార్థులు భిన్న రంగాల్లో రాణించారు.



ఈఏడాది మైగ్రేషన్‌లో భాగంగా ఛత్తీసగఢ్ వెళ్లిన విద్యార్థులు

స్కిల్స్, క్రీడలకు ఎక్కువ ప్రాధాన్యం

● ప్రవలిక, 10వ తరగతి



విద్యాలయంలో బోధన బాగుంది. ఆదేవిధంగా స్కిల్స్ క్రీడలకు అత్యధికంగా ప్రాధాన్యత ఎక్కువగా ఉంది. దీంతో క్రీడలపై ఇంట్రెస్ట్ పెరిగింది. ఇక రీజనల్ స్థాయిలోనూ రాణిస్తాననే నమ్మకం వచ్చింది.

భోజనం విషయంలో కొంత ఇబ్బంది కలిగింది..

ఈప్సిత:10వ తరగతి



భోజనం విషయంలో మొదట్లో కొంత ఇబ్బంది పడ్డా, తర్వాత అలవాటు చేసుకున్నాను. అక్కడి విద్యార్థులతో స్నేహం చేశాక చదువులో రాణించాను. మైగ్రేషన్ నచ్చింది.

సమైక్యతా భావం పెంపొందుతుంది..

● శ్రీనివాసులు, పాలేరు నవోదయ ప్రిన్సిపాల్



మైగ్రేషన్ విధానం ద్వారా విద్యార్థుల్లో జా తీయ సమైక్యతా భావం పెంపొందుతుంది. సంస్కృతీ, సంప్రదాయాలపై మంచి అంగాహన వస్తుంది. దీంతో ఆల్‌రౌండ్ ప్రతిభతో భవిష్యత్‌లో ఎక్కడైనా, రాష్ట్రాల్లోనూ, దేశాల్లోనూ ఎక్కడైనా జీవించగలుగుతారు.

అవగాహన కలిగింది...

● నీతిక, 10వతరగతి



మైగ్రేషన్‌కు వెళ్లే ముందు కొంత బాధ కలిగింది. అక్కడకు వెళ్లాక సంస్కృతి సాంప్రదాయాలు, నీతి, నిజాయితీలపై అవగాహన కలిగింది. హిందీ భాషపై మంచి పరిజ్ఞానం వచ్చింది. ఇంకా అనేక విషయాలు తెలిసాయి. భవిష్యత్‌లో ఎంతో ఉపయోగపడుతాయి.

హిందీ భాషపై పట్టుసాధించా

● తన్విలాష, 10వ తరగతి



సుకుమా నవోదయ విద్యాలయంలో విద్యార్థులు ఎక్కువగా గోండు భాష లేదంటే హిందీ భాషలో మాట్లాడుతారు. దీంతో నిత్యం హిందీలో మాట్లాడటంతో మంచి పట్టుసాధించా. ఇక్కడ సంస్కృతి సాంప్రదాయాలు, పండుగలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. పండుగల్లో తోటివారితో కలిసిపాల్గొనడం గుర్తిండిపోతుంది. తమ తల్లితండ్రులకు, తోటివారిని అధికంగా గౌరవిస్తారు. భవిష్యత్‌లో ఎక్కడైనా ఉద్యోగం చేస్తానని నమ్మకం వచ్చింది.

రైతు రుణమాఫీపై సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురండి

● జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల

రఘునాథపాలెం, జూలై 20: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు రుణమాఫీలో ఇబ్బందులు ఉంటే తక్షణమే అధికారుల దృష్టికి తీసుకరావాలని జిల్లా వ్యవసాయాధికారి విజయనిర్మల కోరారు. శనివారం రఘునాథపాలెం పీఏసీఎస్‌లో నిర్వహించిన సమావేశంలో రైతులతో ముఖాముఖీ మాట్లాడారు. సొసైటీ అధ్యక్షులు తాతా రఘురాం, ఏడీఏ శ్రీనివాసరావు, ఏవో భాస్కర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వాగ్దానాలను అమలు చేయకుంటే పోరాటాలకు సిద్ధం

● తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు బుర్రి వెంకటేశ్వర్లు




సమావేశంలో మాట్లాడుతున్న బుర్రి ప్రసాద్

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 20: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రైతులు, రైతు కూలీలకు వచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని లేకుంటే ఐక్య పోరాటాలకు సిద్ధంగా ఉన్నామని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు బుర్రి వెంకటేశ్వర్లు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం ఖమ్మంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు యర్రా శ్రీనివాసరావు, మాదినేని రమేశ్, గణపతి, బోడపట్ల సుదర్శన్, పగడాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

● ఎనిమిది మంది అరెస్ట్

పాల్వంచ, జూలై 20: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఎనిమిది మందిని అరెస్ట్ చేసిన ఘటన పాల్వంచలో శనివారం చోటు చేసుకుంది. పాల్వంచకు చెందిన కొందరు వ్యక్తులు ఆంధ్ర రాష్ట్రానికి చెందిన మరి కొందరితో కలిసి కుంటినాగులగూడెం ప్రాంతంలోని ఓ షెడ్డులో పేకాట ఆడుతున్నారనే సమాచారం పోలీసులకు అందింది. దీంతో పోలీసులు పేకాట స్థావరంపై దాడిచేసి ఆడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.15,300 నగదు, మూడు కార్లు, నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ అడిషనల్ ఎస్ఐ రాఘవయ్య తెలిపారు.



విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి: పీవో

భద్రాచలం, జూలై 20: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో చదివే గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. శనివారం ఐటీడీఏ సమావేశ మందిరంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నేను ఆకస్మిక తనిఖీలు చేసిన చోట విద్యార్థుల స్టడీపరంగా చాలా లోపాలు కనిపించాయని ముందు అటువంటి సమస్యలు రాకుండా చూడాలని అన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు అందించాలని, పాఠశాలల్లో మైనరు రిపేర్లు చేయించామని మేజరు రిపేర్లు ముందుగా బాలికల పాఠశాలల్లో చేయాలని ఆదేశించారు. పిల్లల చదువు విషయంలో హెచ్ఎంలు తగిన శ్రద్ధ చూపాలలని, పిల్లల్లో నైపుణ్యాలను వెలికి తీసి సంబంధిత హెచ్ఎంలు, సబ్జెక్టు టీచర్లను కూర్చోబెట్టి వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక దృష్టి నిలపాలని కోరారు.

వర్షాలతో భారీ నష్టం

నష్టం అంచనాల్లో అధికార యంత్రాంగం

మూకమామిడి ప్రాజెక్టుకు జలకళ.. పోటెత్తుతున్న వరద

దుమ్ముగూడెం మండలంలో పొంగిపొర్లుతున్న వాగులు



ఉధృతంగా ప్రవహిస్తున్న దుమ్ముగూడెం సీజీ ప్రాజెక్టు



నీళ్లలో నడుచుకుంటూ వెళుతున్న విద్యార్థులు

అశ్వారావుపేట రూరల్, జూలై 20: మండలంలో కురిసిన వర్షాలు భారీ నష్టాన్ని తెచ్చిపెట్టాయి. మండలంలో అశ్వారావుపేట మండలంలో భారీ వర్షాల వలన జరిగిన నష్టంపై అధికార యంత్రాంగం అంచనాలు తయారు చేసే పనిలో నిమగ్నమైంది. ఇప్పటికే ప్రాథమిక అంచనాలు రూపొందించిన అధికారులు శాశ్వత నష్టంపై పూర్తిస్థాయిలో సర్వేలు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా పెదవాగు ప్రాజెక్టు ఎగువ ప్రాంతం, దిగువ ప్రాంతంలో జరిగిన భారీ నష్టాలతో పాటు ఇతర ప్రాంతాల్లో నష్టాలపై అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేధిక పంపించే పనిలో ఉన్నారు. భారీ వర్షాల వలన నీటిపారుదలశాఖకు ఊహించిన నష్టం వాటిల్లగా మిగిలిన వ్యవసాయశాఖ, ఆర్అండ్బీ, రెవిన్యూ, పంచాయతీ రాజ్శాఖలకు సంబంధించి రూ.కోట్లలో నష్టం వాటిల్లింది. మండలంలో భారీ వర్షాలతో దెబ్బతిన్న పంటలపై శనివారం వ్యవసాయశాఖ అధికారులు సర్వే నిర్వహించారు.

మండల వ్యాప్తంగా జోరువాన

అశ్వారావుపేట రూరల్: అల్పపీడన ప్రభావంతో మండలంలో నాలుగో రోజు శనివారం కూడా వాన జోరు కొనసాగింది. కొంతసేపు తెరపనివ్వటం ఆ తరువాత మరికొంత సేపు వాన పడుతూనే ఉంది. అశ్వారావుపేట, అనంతారం, ఊట్లపల్లి, నారాయణపురం, గుమ్మడివల్లి, కన్నాయిగూడెం, కావడిగుండ్ల, నందిపాడు ఇలా అన్ని ప్రాంతాల్లోనూ చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. వర్షంతో గత మూడురోజులుగా ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగోడ్డు గూడెం సమీపంలోని వాగు శనివారం కూడా పొంగి ప్రవహించింది. దీంతో అనంతారం మార్గంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. పంచాయతీ అధికారులు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా కంచెలు ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేపట్టారు. వర్షంతో వెంకమ్మ చెరువు అలుగు ఊహించిన విధంగా పారుతుంది. అనంతారం, కన్నాయిగూడెం, నారాయణపురం, తిరుమలకుంట ప్రాంతాల్లోని చెరువుల అలుగులు భారీగా పారుతున్నాయి. ఎడతెరిపి జల్లులతో జనజీవనం స్తంభించింది. భారీ వర్షాల వలన రెండు రోజుల పాటు ప్రైవేటు పాఠశాలలు సెలవుల ప్రకటించటంతో పాఠశాలలు మూతపడ్డాయి. ప్రభుత్వ పాఠశాలలు యథావిధిగా పనిచేశాయి. ఎడతెరిపి లేకుండా పడుతున్న వర్షాలతో పల్లెల్లో పారిశుద్ధ్యం అత్యంత దారుణంగా తయారైంది. రహదారులు పూర్తిగా బురదమయం అయ్యాయి. పలుచోట్ల నడవటానికి కూడా వీలులేకుండా ఉండటంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.

మూకమామిడి ప్రాజెక్టుకు జలకళ

ములకలపల్లి: మూడు రోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు మధ్యతరహా ప్రాజెక్టు అయిన మూకమామిడి ప్రాజెక్టు భారీగా నీరు చేరటంతో అలుగు పారుతోంది. దీంతో ప్రాజెక్టు నీటితో కళకళలాడుతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పొంగిన వాగులు

జూలూరుపాడు: మండలంలో గత మూడు రోజులుగా ఎడతెరిపి లేని వర్షం కురుస్తుండటంతో శనివారం మండలంలో వాగులు పొంగిపోర్లాయి. దీంతో గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మండలంలోని అన్నారపాడు-గుండ్లరేవు గ్రామాల మధ్య గల అలుగు వాగు తెల్లవారుజాము నుంచే పొంగిపోర్లడంతో ప్రజల రాకపోకలకు అసౌకర్యం కలిగింది. చెరువుల్లో భారీగా నీరు చేరడంతో జలకళ సంతరించుకుంది. రామచంద్రాపురంలో డబల్బెడ్రూం ఇళ్లలో, రహదారులపై నీరు చేరడంతో ఆదివాసీలు ఇబ్బందులు పడ్డారు. జూలూరుపాడు ప్రాథమిక ఉన్నత పాఠశాల ఆవరణలో వర్షపు నీరు భారీగా నిలవడంతో చిన్నపాటి చెరువును తలపించింది. నీరు నిలవడంతో పాఠశాలలోకి వెళ్లేందుకు శనివారం విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

చర్ల అతలాకుతలం

చర్ల: చర్ల మండలంలో గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఏకధాటిగా కురుస్తున్న వానలు చర్ల మండల వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాలు, వీధులు జలమయం అయ్యాయి. అలాగే మండలంలోని పాఠశాలలు వర్షపు నీటితో నిండిపోయాయి. పాత చర్ల ప్రాథమిక పాఠశాల ఆవరణ చెరువుని తలపిస్తోంది. చిన్నారులు నడవ డానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే పాత చర్ల బాలికల హైస్కూల్లో కూడా వర్షపు నీరు చేరింది. బాలికలు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడ్డారు. అలాగే చర్ల మండలం రాళ్లగూడెం పాఠశాల్లో కూడా వర్షపు నీరు చేరింది.

పొంగిపొర్లుతున్న వాగులు..

దుమ్ముగూడెం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం, ఎగువన చత్తీస్ఘడ్లో భారీవర్షాలతో శనివారం మండల వ్యాప్తంగా వాగులు, వంకలు పొంగిపొర్లాయి. సీజీ వాగు పొంగిపొర్లడంతో కెలక్ష్మీపురం-గౌరారం, పెదనల్లబల్లి-కెలక్ష్మీపురం మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చర్ల ప్రధాన రహదారి నుంచి పెదబండిరేవుకు వెళ్లే మార్గంపైకి వరదనీరు చేరింది. గోదావరి బాక్ వాటర్తో సున్నంబట్టి-బైరాగులపాడుల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పర్ణశాల నారచీరలు, ఆ ప్రాంతంలోని దుకాణాలు ముంపుకు గురయ్యాయి. సరిహద్దు చత్తీస్ఘడ్ రాష్ట్రం ధర్మపేట ప్రధాన రహదారిపైన పెదగుబ్బలమంగి వాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. సంగెం గ్రామాన్ని సీతవాగు, చినగుబ్బలమంగి వాగులు చుట్టుముట్టాయి. దీంతో గ్రామాన్ని ఖాళీ చేయించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్న క్రమంలో వాగు తగ్గడంతో వారు ఇళ్లకు వెళ్లిపోయారు. నూతనంగా నిర్మించిన సంగెం వంతెన సైతం వరదముంపుకు గురైంది. మారాయిగూడెం చెరువుకు అలుగు పడడంతో లక్ష్మీనగరం-లక్ష్మీపురం ప్రధాన రహదారిపై రాకపోకలకు ఇబ్బంది తలెత్తింది. వరద రక్షణ చర్యలు చేపట్టేందుకు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు కెలక్ష్మీపురం చేరుకున్నాయి. ఎంపీపీ లక్ష్మీ, తహసీల్దార్ చంద్రశేఖర్, సీఐ అశోక్, ఎస్ఐ వెంకటప్పయ్య, ఆర్ఐలు ఆదినారాయణ, లక్ష్మయ్య వరద ప్రాంతాల్ని సందర్శించారు.

మణుగూరులో ఎడతెరిపి లేని వర్షం

మణుగూరు: మణుగూరులో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సింగరేణి ఓసీ -2 ఓబీ కుప్పల నుంచి పారే వర్షపు వరద నీరు పోటెత్తింది., ఓబి కుప్పలపై ఉన్న కట్టలను తెంచుకుంటూ ఈ నీరు సుందరయ్య నగర్కు చేరింది. దీంతో స్థానికంగా ఉన్న వ్యవసాయ భూములు అన్ని మునకకు గురయ్యాయి. అంతే కాకుండా ఉధృత ప్రవాహాలు సుందరయ్య నగర్ ప్రాంతంతో పాటు వినాయక నగర్ జనావాసాలకు చేరాయి. వరద నీటితో అంతర్గత రహదారులతో పాటు జనావాసాలు జలమయం అయ్యాయి. ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. మణుగూరు మండల తహశీల్దార్ రాఘవ రెడ్డి, మణుగూరు మునిసిపల్ కమీషనర్ ఉమామహేశ్వరరావులు తమ సిబ్బందితో కలసి వరద ముంపు ప్రదేశాలను పరిశీలించారు.

వాగులతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి

ఆళ్లపల్లి: గత మూడు రోజులుగా కురుస్తున్న వానలకు ఆళ్లపల్లి మండలంలో కిన్నెరసాని, జల్లేరు, కోడెల వాగులు ప్రవాహిస్తున్నాయని, ప్రజలు వాగులు దాటవద్దని ఇన్చార్జీ ఎంపీడీవో శ్రీనివాసరావు ప్రజలు సూచించారు. శనివారం ఆయన ఆళ్లపల్లి మండలంలో ప్రవహిస్తున్న వాగులను పరిశీలించారు. ప్రమాదంగా ఉన్న దారులను మూసివేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

అశ్వాపురం: గోదావరి వరద పెరుగుతున్న నేపథ్యంలో పరివాహక ప్రాంతంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అశ్వాపురం సిఐ అశోక్రెడ్డి తెలిపారు. శనివారం మండల పరిధిలోని అమ్మగారిపల్లి, అమెర్ధా, చింతిర్యాల గోదావరి రేవుల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా సీఐ ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడారు.

పునరావాస కేంద్రాలకు భవనాలను గుర్తించండి

బూర్గంపాడు: బూర్గంపాడు మండల పరిధిలో గోదావరి వరద ఉధృతి, వరద పరివాహక ప్రాంతాలను శనివారం జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతూ గోదావరి పరివాహక ప్రాంతాలతో పాటు మిగిలిన గ్రామపంచాయతీలలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాలలో ఎత్తైన ప్రదేశంలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయటానికి భవనాలను గుర్తించాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహించాలని, త్రాగునీటి ట్యాంకులు ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని సూచించారు.



మారాయిగూడెం రహదారిపై పారుతున్న అలుగు



అశ్వారావుపేట రాష్ట్రీయ రహదారిపై గుంతలు



రామచంద్రాపురం డబుల్ ఇళ్ల వద్ద పరిస్థితి



చర్ల మండలం రాళ్లవాగు పాఠశాల దుస్థితి

ప్రజలకు అందుబాటులో పోలీసులు: ఎస్పీ

కొత్తగూడెం, జూలై 20: భారీ వర్షాల నేపధ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రజలకు అందుబాటులో జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది ఉన్నారని ఎస్పీ రోహిత్రాజ్ అన్నారు. శనివారం ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ ఉండాలని ఆయన ఆదేశించారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో వరద నీటి ఉధృతితో రాకపోకలకు ఆటంకాలు కలుగుతున్న రహదారుల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి అట్టి ప్రదేశాలలో గస్తీని ముమ్మరం చేయడం జరిగిందన్నారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావద్దని విజ్ఞప్తి చేశారు. విపత్తుల కాలంలో ప్రజలకు సేవలందించడంలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఆపదలో ఉన్న వారు డయల్ 100కు ఫోన్ చేసి పోలీస్ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి

దుమ్ముగూడెం, జూలై 20: విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములవ్వాలని హెచ్ఎం బోళ్ల వెంకటేశ్వర్లు అన్నారు. నరసాపురం ఎస్ఎస్ఏఎం ఉన్నత పాఠశాలలో శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఇంటివద్ద విద్యార్థులు చదువుకునే అవకాశం, సదుపాయం కల్పించాలని ఉపాధ్యాయులు కోరారు.

కలెక్టర్కు అఖిలపక్ష నేతల వినతి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై 20: కొత్తగూడెం మున్సిపాలిటీలో జరిగిన అవినీతిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్ జితేష్ వి పాటిల్కు అఖిలపక్ష నాయకులు శనివారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని, ఇటీవల నిర్వహించిన వివిధ రకాల టెండర్లను రద్దు చేసి మరో సారి టెండర్లను ఆహ్వానించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ను కలిసిన వారిలో టీపీసీసీ సభ్యుడు జేబీ శౌరీ, బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్, జిల్లా అధ్యక్షుడు గంధం మల్లిఖార్జున్రావు, సీపీఎం నాయకులు వీరన్న, జలాల్, మున్సిపాలిటీ కౌన్సిలర్ తంగెళ్ళ లక్ష్మణ్, ఆదివాసీ ఐక్యవేధిక రాష్ట్ర కన్వీనర్ వాసం రామకృష్ణ, దళిత సంఘ నాయకులు బొమ్మెర శ్రీనివాస్, మురళీ తదితరులు ఉన్నారు.

‘ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి’

చుంచుపల్లి, జూలై 20: సింగరేణిలో పని చేస్తున్న ప్రైవేటు ఏజెన్సీ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న కోరారు. శనివారం హైదారాబాద్లోని సింగరేణి భవన్లో తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహాదారు మండలి కార్పొరేషన్ చైర్మన్ జనక్ ప్రసాద్కు వినతిపత్రం అందించారు. ఉద్యోగుల భద్రత, వారు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పరిష్కారానికి తప్పక చర్యలు చేపడతామని చైర్మన్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు గుడివాడ రాజేంద్రప్రసాద్, భాస్కర్, రామారావు, శ్రీకాంత్, జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

‘వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి’

కరకగూడెం, జూలై 20: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు బ్రిడ్జిలు, రహదారులు, చెరువుల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని భద్రాచలం డీఎల్పీవో సుధీర్ కుమార్, జిల్లా మైనింగ్ డీఈ దినేష్ కోరారు. శనివారం మండలంలోని పెద్దవాగు, కుర్నవల్లిలోని బూడిదవాగు, బర్లగూడెం బ్రిడ్జిలను, గ్రామాల్లో పారిశుధ్య పనులను డీఎల్పీవో, డీఈ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.

నిబద్ధతతో పనిచేయండి: ఎంపీపీ

గుండాల, జూలై 20: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారులు చెబుతున్నప్పటికి మండలంలోని అధికారులు నిర్లక్ష్యంతో కనీసం సమావేశాలకు సైతం హాజరు కావడం లేదని ఎంపీపీ ముక్తి సత్యం ఆగ్రహం వ్యక్త చేశారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ముక్తి సత్యం అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉధృతంగా కురుస్తున్న వర్షాలకు వాగులు వంతెనల పై నుంచి ప్రవహించే పరిస్థితి ఉందని, చెరువులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, అధికారులు సమన్వయంతో, నిబద్ధతతో పనిచేయాలని కోరారు. పశువులు రోగాల బారిన పడి మృతి చెందుతుంటే పశువైద్యాధికారి కన్నెత్తి చూడటం లేదన్నారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ రామక్క, ఎంపీటీసీ కృష్ణారావు, తహసీల్దార్ ఇమ్మాన్యుయెల్, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీఓ రామక్రిష్ణ, డీటీ రజిని పాల్గొన్నారు.

అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేయాలి: కూనంనేని

కొత్తగూడెం, జూలై 20: వర్షాలు, వరదలలో అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో పని చేయాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం వర్షాలు, వరదలపై అధికారులతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమీక్ష- సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్ట నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చునని సూచించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు పొంగి అనేక గ్రామాలకు రాకపోకలు స్తంబించే పరిస్థితి ఏర్పడిందని యుద్ధప్రాతిపధికన పునరుద్దరణ చర్యలు చేపట్టాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మునిసిపల్ శాఖ, పంచాయతీరాజ్ శాఖలు పారిశుద్యంపై దృష్టి సారించాలన్నారు. ఈ సమీక్షలో కొత్తగూడెం ఆర్డీఓ మధు, డీఎస్పీ రెహమాన్, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి భాస్కర్ నాయక్, డీఈఓ వెంకటేశ్వరాచారి, విద్యుత్శాఖ డీఈ నందయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

నర్సరీ అభివృద్ధికి కృషిచేయండి: పీవో

కొత్తగూడెం, జూలై 20: గరిమెళ్లపాడు నర్సరీని మరింత అభివృద్ధి చేయడానికి సంబంధిత అధికారులు తగు ప్రణాళికలు రూపొందించాలని ఐటీడీఏ పీవో రాహుల్ అధికారులను ఆదేశించారు. శనివారం నర్సరీని ఆకస్మికంగా సందర్శించారు. నర్సరీలోని పరిసరాలన్నీ కలియ తిరిగి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం నర్సరీ పెంపకం, పండ్ల తోటల పెంపకం తీరు బాగానే ఉందని, ఇంకా 50శాతం ఖాళీ ప్రదేశం మిగిలి ఉన్నందున వివిధ రకాల కూరగాయల సాగు, పండ్ల తోటల పెంపకం చేపట్టి నర్సరీని మరింత అభివృద్ధి పరచాలన్నారు. దానికి గాను ఏయే ప్రదేశంలో ఏ మొక్కలు వేస్తే పెరుగుతాయో కృషి విజ్ఞాన కేంద్రం సైంటిస్టుల ద్వారా స్థల పరిశీలన చేసి ఆ నివేదికలను అందజేయాలన్నారు. అదే విధంగా నర్సరీని అభివృద్ధి చేయడంలో భాగంగా కడియంలో ఉన్న నర్సరీలను ఉద్యానవన, వ్యవసాయ అధికారులతో సందర్శించి వారు అక్కడ తోటల్లో అనుసరిస్తున్న విధానాలను తెలుసుకోవాలని, అక్కడ తెలుసుకున్న సాగు మెళుకువలను అనుసరించి గరిమెళ్లపాడు నర్సరీని అభివృద్ధి చేయడానికి సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఉద్యానవన అధికారి అశోక్, ఎన్ఆర్ఈజీఎస్ టీఏ నాగరాజు, డీఆర్డీఏ ప్లాంటేషన్ మేనేజర్ రాజు, కృషి విజ్ఞాన కేంద్రం సైంటిస్ట్ శివ తదితరులు పాల్గొన్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న పీవో రాహుల్

సమస్యలను పట్టించుకోరూ..

ఆళ్లపల్లి, జూలై 20: ఆళ్లపల్లి మండలం, మర్కోడు ఎంపీపీ పాఠశాలలో నెలకొన్న సమస్యలను జిల్లా విద్యాశాఖ, ఆర్అండ్బీ అధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లితండ్రులు ఆగ్రహ వ్యక్తం చేశారు. శనివారం పాఠశాలలో జరిగిన ఓ సమావేశంలో విద్యార్థుల తల్లితండ్రులు మాట్లాడుతూ.. మనఊరు-మనబడి అంటు పాఠశాల భవనం కూల్చి విద్యార్థులకు భవనం లేకుండా చేశారని, రెండేళ్లు గడుస్తున్నపట్టికి ఆయా పనులపై జిల్లా అధికారులు నోరు మెదపడం లేదని, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారిందన్నారు. పాఠశాల నిర్మాణంపై రెండు రోజుల్లో ఏదైన ఒక స్పష్టత ఇవ్వకపోతే మా పిల్లలతో కలిసి జిల్లా కలెక్టర్ను కలుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు శ్రవణ్, శేఖర్, మల్లికార్జున్, సతీష్, రవి, శ్రీకాంత్, నవీన్, రాము, భూర్ణ రవి, సుదాకర్, నాగేష్, రంజిత్, రాము, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

‘ఉప్పొంగుతున్న వాగులను దాటొద్దు’

గుండాల, జూలై 20: రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగుల్లోకి వరద నీరు చేరుతుండటంతో కిన్నెరసాని, మల్లన్నవాగు, ఏడుమెలికల వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మరో రెండు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపద్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. తహసీల్దార్ ఇమ్మానుయేల్, ఎంపీడీవో సత్యనారాయణ, సీఐ రవీందర్ వాగులను సందర్శించారు. కిన్నెరసాని వాగుపై కొడవటంచ లో లెవల్ వంతెన పై నుంచి నీరు ప్రవహించే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న రహదారులను పరిశీలించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. వాగులను దాటకుండా అధికారుల సూచనలు పాటించాలని తెలిపారు. అత్యవసర సమయాల్లో 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

రైతులకు పంటనష్ట పరిహారం ఇవ్వాలి



మాట్లాడుతున్న విశ్వనాథం

పాల్వంచ టౌన్, జూలై 20: తుఫాను వలన పంట నష్ట పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి ముత్యాల విశ్వనాథం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పార్టీ కార్యాలయం సీఆర్ భవన్లో చంద్ర నరేంద్రకుమార్ అధ్యక్షతన జరిగిన జిల్లా రైతుసంఘం ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు బ్యాంకులలో రైతులు తీసుకున్న రెండు లక్షల రుణాలను బేషరతుగా మాఫీ చేయాలని కోరారు. డాక్టర్ స్వామినాథన్ కమీషన్ చెప్పిన విధంగా రైతులకు గిట్టుబాటు ధర కల్పించి రైతులు అప్పుల ఊబిలోకి కూరుకుపోకుండా కాపాడాలని అన్నారు. విస్తృతంగా వ్యవసాయ గిడ్డంగులను ఏర్పాటు చేయాలని, 15 ఎకరాల వరకు రైతులందరికీ రైతుబంధు వర్తింపజేయాలని, ఎరువుల ధరలు తగ్గించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం గౌరవ అధ్యక్షులు బ్రహ్మం, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రవికుమార్, శ్రీనివాస్, జిల్లా నాయకులు పూర్ణచంద్రరావు, రామచందర్, రవికుమార్, వేణు, నాగేశ్వరరావు, నెహ్రూ, వాడే లక్ష్మి పాల్గొన్నారు.